క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె: మండలంలోని తలపనూరు గ్రామ పొలాల్లో వెలసిన గంగమ్మ, అనిమెల గ్రామ సమీపంలో కోరుకొండపై వెలసిన బోగాదమ్మతల్లికి ప్రత్యేపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రాడవంతో ఆలయాలు రద్దీగా దర్శనమిచ్చాయి. అర్చకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రామ దేవతలకు బోనాలు



గ్రామ దేవతలకు బోనాలు మోసుకెళుతున్న మహిళలు

లింగాల : వర్షం కురవాలని కోరుతూ మండలంలోని ఎగువపల్లెలో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా ఇంతవరకు పదునుపాటి వర్షం కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురవాలని కోరుతూ గ్రామ ప్రజలు భాగవత పారాయణం, గ్రామాల్లో రామ భజనలు నిర్వహించారు. అలాగే ఇంటింటా బోనాలు తయారు చేసి గ్రామ దేవతలైన పెద్దమ్మ, అంకాలమ్మ, గంగమ్మ దేవతలకు సమర్పించారు. గ్రామ దేవతలకు 101 బిందెల నీటితో జలాభిషేకం నిర్వహించారు.

15న శని త్రయోదశి పూజలు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ సమేత సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15న శనిత్రయోదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళిశర్మ, ఈఓ శ్రీధర్ తెలిపారు. శని త్రయోదశిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఉదయం 8.30 నుంచి విశేష పూజలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటాయన్నారు. సాయంత్రం 5.30 గంటలకు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

పులివెందులను మరింత అభివృద్ధి చేస్తాం

- రూ.3.25 కోట్లతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ప్రారంభం
- కౌన్సిలర్లతో ముఖ్యమంత్రి ఆత్మీయ సమావేశం
- ఆప్యాయంగా పేరు పేరునా పలకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : దేవుడు ఆశీస్సులతో పులివెందులను మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో భాగంగా రూ.3.25 కోట్ల పాడా నిధులతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి ముందు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పులివెందుల అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈరోజు ఈవిధంగా మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పులివెందుల టౌన్‌కు సంబంధించి వరప్రసాద్ డెవలప్‌మెంట్ గురించి చెబుతున్నప్పుడు నిజంగా 2006, 2007, 2008 ఆ ప్రాంతంలో నాన్న ఉన్నప్పుడు ఏ మాదిరిగా అభివృద్ధి జరిగింది.. నాన్న చనిపోయిన తర్వాత ఒక్కసారిగా పులివెందులలో ఎక్కడి పనులు అక్కడే మధ్యలో ఆగిపోయిన పరిస్థితులు కనిపించాయి. అటువంటి దారుణమైన పరిస్థితి నుంచి మళ్లీ ఈరోజు పై నుంచి నాన్న సంతోషపడే విధంగా పులివెందుల ప్రజలు మరీ ముఖ్యంగా మీరంతా నాకు తోడుగా నిలబడబట్టే రాష్ట్రమంతా ఈ రోజు పులివెందుల వైపు చూసేటట్లుగా చేయగలుగుతున్నాము. మీరిచ్చిన సపోర్ట్, మీరిచ్చిన తోడ్పాటు నా జీవిత కాలంలో నేనెప్పుడు మరిచిపోలేనని చెబుతున్నా.. మీరంతా నన్ను ప్రోత్సహించి నా వెన్ను తట్టి నన్ను అడుగులు ముందుకు వేయగలిగిస్తున్నారు కాబట్టే ఈరోజు దేశం మొత్తం పులివెందుల వైపు చూసే విధంగా చేయగలుగుతున్నాం..

ఈ రోజు దేవుడు దయతో రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ అభివృద్ధిచేసే విధంగా అవకాశాన్ని దేవుడు ఇవ్వాలని మనసారా కోరుకుంటున్నాను. అదేవిధంగా మీ అందరి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా మీ అందరిని కోరుకుంటున్నాను. ఇక్కడ మీకు మంచి టీమ్ ఉంది.. మంచి ఎంపీ అవినాష్, అలాగే మనోహర్ చిన్నాన్న అన్ని రకాలుగా అందుబాటులో ఉండి ఎప్పుడు ఎవరికి ఏ సహాయం కావాలన్నా.. వీరిద్దరూ బాగా తోడ్పాటు ఇస్తున్నారు. వీరు ఫలానా దగ్గర ఇబ్బందులు ఉన్నాయని నాకు చెబితే పైన సాల్వ్ చేయడానికి నేనున్నాను. అలాగే జిల్లాకు చెందిన మంచి కలెక్టర్ విజయరామరాజు, పులివెందుల ప్రాంతానికే చెందిన చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కూడా నా పక్కన ఉండి అన్ని రకాలుగా పులివెందుల అభివృద్ధికి తాను కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడన్నది వాస్తవం. ఈరోజు అందరం దేవుడు ఆశీస్సులతో ఇంకా మంచి చేయడానికి అడుగులు ముందుకు వేద్దాం.. పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించిన రికరింగ్ ఎక్స్‌పెండేచర్ కట్టుకునే పరిస్థితిలోకి రావడం కష్టంగా ఉందని చెబుతున్నారని.. దానికి సంబంధించి ఇక్కడ ఎంఐజీ లేఅవుట్ డెవలప్‌మెంట్ చేస్తున్నామని.. దానికి సంబంధించి ల్యాండ్ అక్విజేషన్ దాదాపు 60ఎకరాలు పూర్తయ్యిందని.. ఆ ఎంఐజీ లేఅవుట్‌లో ఎవరికైతే అమ్ముతారో ఆ వచ్చిన డబ్బులు దాదాపుగా 80 నుంచి 100 కోట్లు వస్తుందనుకుంటున్నామని.. ఆ డబ్బులు ఇదే మున్సిపాలిటీలో ఫిక్సడ్ డిపాజిట్ చేసి పక్కన పెట్టుకుందామన్నారు. దానికి సంబంధించి వచ్చే వడ్డీతో పులివెందుల మున్సిపాలిటీ నడపడానికి దోహదపడుతుందని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రికి సన్మానం.. :

పులివెందుల మున్సిపాలిటీ ప్రాంతాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రిని తామెప్పటికి మరువలేమని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాలు, పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్‌రెడ్డి, సీఎం కార్యాలయ అధికారి ధనుంజయరెడ్డి, సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.



పులివెందుల సిటీ ఫారెస్ట్‌లో మొక్కలకు నీరు పోస్తున్న సీఎం వైఎస్ జగన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజుల్లా, వార్డు కౌన్సిలర్ కమలమ్మ, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు

ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ

వేంపల్లె : స్థానిక ప్రభుత్వాసుపత్రిని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేసి ల్యాబ్‌లో రికార్డులు, రోగులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ దీపతో చర్చించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరమ్మతో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు వసతులు, సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయం పాటించాలని ఆదేశించారు. మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సురేంద్రబాబు

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంకు సంబంధించి ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా రాయవరం సురేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి పి.రామచంద్రరావు ఆర్యవైశ్య సంఘానికి లక్ష రూపాయలు బాకీ అయ్యారు. అతను ఐపీ దాఖలు చేయడంతో మాజీ అధ్యక్షుడు వి.రాజారావు కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వడ్లకుంట రాజారావు రాజీనామా చేశారు. ఆదివారం జరిగిన కమిటీ సమావేశంలో ఆర్.సురేంద్రబాబును నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజులలో కమిటీ సభ్యులను ఎన్నుకుంటారని, ఈనెల 14వ తేదీన శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.



ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రాయవరం సురేంద్రబాబు

వెంకటశివారెడ్డికి స్పోర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్

కడప స్పోర్ట్స్ : కడప నగరం ఎన్‌జీఓ కాలనీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రా క్రికెట్ సంఘం సీఈఓ ఎం. వెంకటశివారెడ్డికి యూఎస్‌కి చెందిన జేబీఆర్ హార్వర్డ్ విశ్వవిద్యాలయం అక్రిడేషన్ జారీచేసిన సెయింట్ మదర్ థెరిసా యూనివర్సిటీ, (ఆస్ట్రేలియా) క్రీడల్లో గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆగస్టు 5వ తేదీన మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో నిర్వహించే కాన్వొకేషన్ వేడుకల్లో ఈయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. ఈయన క్రీడారంగానికి చేసిన కృషిని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. కాగా జిల్లాకు చెందిన వెంకటశివారెడ్డికి క్రీడల్లో గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి అభినందనలు తెలిపారు. పలువురు క్రీడాసంఘ ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

శాంతిని పెంపొందించడమే మానవతా లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మానవతా సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు గోపి

జమ్మలమడుగు : సమాజంలో శాంతిని పెంపొందించడమే మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రధాన ఉద్దేశమని మానవతా సేవాసంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు రాటాల గోపి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్వీ డిగ్రీకాలేజి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవతా సంస్థ ద్వారా సమాజంలో వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడంతపాటు మరణించిన వారి కోసం బాడీ ఫ్రీజర్లు, శాంతిరథాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మానవత నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మస్తాన్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, వనం గురుకుమార్, అక్రమ్ హుస్సేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యకరమంలో సుధాకర్ గుప్తా, మాధవరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు నూతన కమిటీ ఎర్పాటు

జమ్మలమడుగు : మాలమహానాడు కడప జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నికలను, నూతన కమిటీని ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనం శివయ్య, రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి శేగారి ప్రభుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కుందవరం పుష్పరాజ్, ఉపాధ్యక్షుడిగా బిర్రు దానియేలులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక కొత్తనగర్‌కు చెందిన ఆది డేవిడ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు నాగలారపు బాబు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సులభరీతిలో గణితం బోధించాలి

కడప ఎడ్యుకేషన్ : గణితాన్ని విద్యార్థులకు సులభ రీతిలో బోధించేందుకు గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలని గణితఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అట్ల నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో గణిత ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గణితఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక స్టేట్ టెక్నికల్ కమిటీ కన్వీనర్ కోనా కిరణ్‌కుమార్‌రెడ్డి, పీవీ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో గౌరవాధ్యక్షుడిగా సునీల్‌కుమార్, అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగరాజు, కిషోర్, శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నూరుల్లా, అదనపు కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సురేష్‌బాబు, సురేష్, మనోహరయ్య, పోల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జీవీ రమణలతోపాటు పలువురు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది

ప్రొద్దుటూరు కల్చరల్ : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి పేర్కొన్నారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెరిగి పోతున్న కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, బయటకు వెళ్లే సమయంలో క్యారీబాగ్‌లను తీసుకెళ్లాలని సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా జెవీవీ సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. జేవీవీ పట్టణాధ్యక్షుడు డాక్టర్ జె.శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.